క్లుప్తంగా

రేపు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 8వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం వారి సూచనలు సలహాలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ పరంగా ఏమైనా సమస్యలు తెలియజేయాలంటే 9959225702ను సంప్రదించాలని సూచించారు.

గ్రామ రెవెన్యూ సభలో 22 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సభకు 22 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్‌రావు, వీఆర్‌ఓలు వై.పి.రంగయ్య, అరిగెల వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పిచ్చిరెడ్డి

గిద్దలూరు రూరల్: రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు టి.పిచ్చిరెడ్డి కోరారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం రవాణా కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రైవేట్ విద్యా సంస్థల్లోని బస్సులకు వేల మంది డ్రైవర్లు, క్లీనర్లు, వాచ్‌మెన్‌లు, స్వీపర్లు, అటెండర్లు పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, యూనియన్ నాయకులు నాగభూషణం, రహీం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ టారిఫ్‌లపై అభిప్రాయ సేకరణ


ఈఈ నాగేశ్వరరావు

మార్కాపురం టౌన్: ఈనెల 7,8,10వ తేదీల్లో విద్యుత్ టారిఫ్‌లపై ప్రజాభిప్రాయ సేకరణ మార్కాపురం విద్యుత్‌శాఖ ఈఈ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు ఈఈ పీవీ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికిగాను విద్యుత్ టారిఫ్‌లపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు చెప్పారు. విజయవాడ, కర్నూలు సెంటర్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అభిప్రాయాలు వెల్లడించవచ్చని పేర్కొన్నారు. మార్కాపురం ఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినియోగదారులు తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు.

కరాటే విద్యార్థులకు గ్రేడ్ టెస్టింగ్


గ్రేడ్ టెస్టుల్లో పాల్గొన్న విద్యార్థులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్లో 50 మంది విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడ్ టెస్టులు నిర్వహించినట్లు ఇన్‌స్ట్రక్టర్ తోట ప్రసాద్ తెలిపారు. చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన టెస్టును వివిధ పార్టీల నాయకులైన అందె నాసరయ్య, డాక్టర్ మౌలాలి, డాక్టర్ రఘు తదితరులు పర్యవేక్షించారు.

స్వయం సహాయక గ్రూపుల ఆదాయంపై సర్వే చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: స్వయం సహాయక గ్రూపుల ఆదాయంపై సర్వే నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.రవికుమార్ అన్నారు. ఒంగోలు టీటీడీ సెంటర్‌లో సోమవారం వీఓఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పీడీ పాల్గొని మాట్లాడారు. సంస్థాగత నిర్మాణం విభాగంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్, గ్రూపుల గ్రేడింగ్, రికవరీలను వెంటనే చేపట్టాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్‌లో రాష్ట్రంలోనే మూడో స్థానంలో జిల్లా నిలిచిందన్నారు. ప్రతి వీఓఏ తమ గ్రామ సంఘం పరిధిలోని స్వయం సహాయక సంఘ సభ్యులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు అందజేయడంలో ముందంజలో ఉండాలన్నారు. 38 మండలాల్లోని క్లస్టర్ సీసీల పరిధిలో ఒక వీఓఏ చొప్పున, 138 వీఓఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


కొమరోలు సమీపంలో హైవేపై బైక్ ఢీకొని మృతి చెందిన వృద్ధుడు


తాటిచెర్ల మోటు వద్ద ప్రమాదంలో మృతి చెందిన మౌలాలి


బేస్తవారిపేట వద్ద బైక్ ఆటో ఢీకొట్టడంతో గాయపడిన వ్యక్తి(ఫైల్)

అతివేగంగా మృత్యు ఒడికి..!

- ప్రమాదాల బారినపడుతూ ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు
- గడిచిన ఏడాది కాలంలో నియోజకవర్గంలో 85కు పైగా ప్రమాదాలు
- సుమారు 55 మంది మృతి, 104 మంది వరకు క్షతగాత్రులు
- అయినా వాహనదారుల్లో కానరాని మార్పు

గిద్దలూరు రూరల్:

అతివేగం, అవగాహన లోపం వల్ల వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నా మిగిలిన వారిలో పెద్దగా మార్పు రావడం లేదు. ఊహించని ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబ సభ్యులు, బంధువుల హృదయాలు ఎంతగా విలపిస్తాయో ఆ బాధ అనుభవించిన వారికే తెలుస్తుంది. రహదారులపై రయ్ రయ్‌మంటూ అతివేగంగా వాహనాలు నడిపే వారికి యమలోకం తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయి. నియోజకవర్గంలో ఆరు మండలాల్లో గడిచిన ఏడాది కాలంలో కారు ప్రమాదాలు, లారీ , బైక్, ట్రాక్టర్, ఆటో. ద్విచక్ర వాహన ప్రమాదాలు మొత్తం 85కు పైగా చోటుచేసుకున్నాయి. వీటిలో సుమారు 55 మంది ప్రాణాలు కోల్పోగా 85 మంది క్షతగాత్రులయ్యారు. బేస్తవారిపేట, కంభం, కొమరోలు, గిద్దలూరు పోలీసు స్టేషన్ల పరిధిలోని జాతీయ రహదారుల వెంట అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జాతీయ రహదారి కావడం వల్ల వాహనాలు నడిపే వారు అవగాహన లేకుండా అతివేగంగా వెళ్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మరికొందరు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. నంద్యాల నుంచి గిద్దలూరు మధ్యలో నల్లమల ఘాట్ రోడ్డు, కొమరోలు తాటిచెర్ల, పందిళ్లపల్లె, మోక్షగుండం, కంభం–జంగంగుట్ల, తిప్పాయపాలెం తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారిపై అధిక ప్రమాదాలు చోటుచేసుకున్నట్లు క్రైమ్ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. 10 రోజుల క్రితం బేస్తవారిపేట పందిళ్లపల్లె వద్ద ఆగి ఉన్న బస్సును ఆకుకూరలు అమ్ముకునే కృష్ణ అనే వ్యక్తి ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టి మృతి చెందాడు. అదే రోజు తాటిచెర్లమోటు వద్ద రాచర్ల మండలం గుడిమెట్ట గ్రామానికి చెందిన సుంకరి మౌలాలి బైక్ పై వెళ్తుండగా బొలెరో వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. డిసెంబర్ 16వ తేదీన కొమరోలు మండలం పోరుమామిళ్ల హైవే రోడ్డుపై నడిచి వెళ్తున్న గుర్తు తెలియని ఓ వృద్ధుడిని బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌తో ఢీ కొట్టిన వ్యక్తి తీవ్ర గాయాలతో బయటపడ్డాడు.


గిద్దలూరు వైఎస్సార్ సెంటర్ వద్ద ప్రమాదాల నివారణపై పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ


కంభం వద్ద బైక్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి వివరాలు సేకరిస్తున్న పోలీసులు(ఫైల్)

గిద్దలూరు నియోజకవర్గ రోడ్డు ప్రమాద గణాంకాలు

పోలీస్ స్టేషన్	మరణాలు	క్షతగాత్రులు	కారు	బైక్	లారీ	ఆటో	ట్రాక్టర్	బస్సు	మొత్తం కేసులు
గిద్దలూరు	08	21	6	13	1	--	--	--	20
కొమరోలు	07	10	04	09	02	--	--	--	15
బేస్తవారిపేట	15	21	03	08	02	07	--	--	20
కంభం	20	50	06	12	02	01	--	--	21
రాచర్ల	04	07	01	07	--	--	01	01	10
అర్ధవీడు	01	--	--	--	--	--	--	--	01

ప్రచారం చేస్తున్నా ఫలితం శూన్యం

ప్రమాదాలపై ఒక వైపు పోలీసులు ప్రచారం చేస్తున్నప్పటికీ ఫలితం కానరావడం లేదు. రహదారులు రక్తసిక్తమై ప్రాణాలు పోతున్నప్పటికీ ప్రమాదాలను నివారించే దిశగా చర్యలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడిపే వారు, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువతను కట్టడి చేయడంపై పోలీసులు దృష్టి సారించాల్సి ఉందని మృతుల బంధువులు అభిప్రాయపడుతున్నారు. ప్రధాన వీధుల్లో బైక్‌లపై చక్కర్లు కొడుతూ ప్రజలను భయకంపితులను చేస్తున్న వారిని కట్టడి చేయాలని గిద్దలూరు, కంభం, బేస్తవారిపేటలో ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సైలెన్సర్లు తొలగించిన బైక్‌ల నుంచి వస్తున్న శబ్దాలు గుండెపోటు బాధితులను మరింత ఇబ్బందికి గురిచేస్తున్నాయని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు


విద్యుత్ షాక్‌తో గాయాలపాలైన ధన్‌రాజ్

గిద్దలూరు రూరల్: వీధిలైట్లకు మరమ్మతులు చేస్తున్న ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన గిద్దలూరు మండలంలోని కొమ్మునూరులో సోమవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కొమ్మనూరు గ్రామంలో వీధిలైట్లు పనిచేయడం లేదు. గ్రామ కార్యదర్శి విజ్ఞప్తి మేరకు అంబవరం గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ ధన్‌రాజ్ వీధిలైట్లకు మరమ్మతులు చేస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడ్డాడు. స్థానికులు హుటాహుటిన స్పందించి ఆటోలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రగాయాలపాలైన ధన్‌రాజ్‌ను పరీక్షించిన వైద్యులు అతడిని మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి సిఫార్సు చేశారు. ఈ మేరకు బంధువులు కర్నూలు వైద్యశాలకు తరలించారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ఫ్యామిలీ వెల్ఫేర్ డీడీ రామ్‌నాథ్


ఈగలపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న రామ్‌నాథ్

పొదిలి రూరల్: డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రజలు తాము నివాసం ఉండే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర ఫ్యామిలీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాథ్ సూచించారు. సోమవారం పొదిలి మండలంలోని ఈగలపాడు పంచాయతీలో జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్ జ్వరాలపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆవాస ప్రాంతంలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించి డెంగీ, మలేరియా కిట్లతో పరీక్షించినట్లు తెలిపారు. సాయంత్రం సమయంలో దోమల వ్యాప్తిని నివారించడానికి ఫాగింగ్ చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యాక్రమంలో డీఎంఓ శ్రావణకుమార్, ఎంపీడీఓ శోభన్‌బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సుగుణకుమార్, డాక్టర్ శరత్‌చంద్ర, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో ఫ్లెక్సీల రగడ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని 16వ బ్లాకులో టీడీపీలోని రెండు వర్గాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ టీడీపీలోని రెండు గ్రూపులు పోటాపోటీగా తమ పార్టీ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి. వీరిలో 2019 నుంచి టీడీపీలో చురుగ్గా ఉన్న నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా.. 2024 ఎన్నికల ముందు టీడీపీ తీర్థం పుచ్చుకున్న మరో నాయకుడు అంతే స్థాయిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో వివాదం రాజుకుంది. ఇరు వర్గాల వారు ఫ్లెక్సీలు చించుకుని రచ్చకెక్కారు.


చినిగిన టీడీపీ నేత ఫ్లెక్సీ

ప్రజా సంకల్ప వేదిక కమిటీలో పలువురికి పదవులు


మునీర్


వెంకటేశ్వర్లు


మల్లికార్జున్

మార్కాపురం: ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర కమిటీలో మార్కాపురం వాసులకు పదవులు లభించాయి. ఆర్‌టీఐ విభాగం నుంచి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా షేక్ మున్నీర్ బాషా, ఆర్‌టీఐ అడ్వైజర్‌గా తిప్పనబోయిన మల్లికార్జున, మీడియా రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కల్లూరి వెంకటేశ్వర్లును నియమిస్తూ కమిటీ అధ్యక్షులు మదిరె రంగసాయిరెడ్డి తెలిపారు. ఆదివారం గుంటూరులో నిర్వహించిన సమావేశంలో కమిటీని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు చెప్పారు.

భక్తి శ్రద్ధలతో తిరుప్పావై సేవ


తిరుప్పావై సేవలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రత్యేక పూజల్లో భాగంగా మహిళా భక్తులు సోమవారం గోదాదేవికి 22వ పాశురం చదివి పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండగ వరకు ధనుర్మాస పూజలను వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి, కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో కూడా తిరుప్పావై ప్రత్యేక పూజలు అర్చకులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి నిట్టూరి రమేష్‌తోపాటు సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.


ముగ్గులు వేస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థినులు

ఏ1 కాలేజీలో రంగవల్లుల సంబరం


మార్కాపురం: స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ ఆధ్వర్యంలో సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కులాలు, మతాలు గౌరవించడం, అన్ని వర్గాల పండగలను నిర్వహించుకోవడం ప్రజలందరి బాధ్యత అని పేర్కొన్నారు. కళాశాలలో ఏటా అన్ని రకాల పండగలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముగ్గుల పోటీలో విద్యార్థినులు ఆసక్తిగా పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. విజేతలకు బహుమతులు అందించనున్నట్లు చైర్మన్ తెలిపారు.



పంట పొలాల చుట్టూ చుట్టిన చీరలు

మంచెలపై జాగారం పంటలపై మమకారం


కోతులు, పిట్టలను తరుముతూ..


మంచెపై కాపలా ఉన్న రైతు


పంట పొలాల్లో కోతుల గుంపు

కొనకనమిట్ల: అన్నదాతలకు పంటలు కూడా కన్నబిడ్డలతో సమానమే.! వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులు పడే శ్రమ అంతా ఇంతా కాదు. ప్రకృతి వైపరీత్యాలు, పురుగులు, తెగుళ్ల బెడదతో నిత్యం సతమతమయ్యే రైతులు పంట చేతికొచ్చే సమయంలో నిద్రలేని రాత్రులు గడుపుతుంటారు. పగటి వేళ కోతులు, పక్షులు.. రాత్రి వేళ అడవి పందుల దాడులు వెరసి నోటికాడి పంటను నాశనం చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో పంటలను సంరక్షించుకునేందుకు రైతులు తమకు తోచిన ప్రయత్నాలు చేస్తున్నారు. కోతకొచ్చిన అలసంద, మినుము, జొన్న, వరి, సజ్జ పంటల వద్ద రైతులు రోజూ రేయింబవళ్లు జాగారం చేయక తప్పడంలేదు. ఒక్క రోజు ఆదమరిచి నిద్రపోయినా పంటలను ఒక్క రాత్రిలోనే పందుల గుంపులు సర్వనాశనం చేయడం ఖాయం.! అందుకే రైతులు తమ పొలాల్లో మంచెలు నిర్మించుకుని వాటిలోనే ఉంటూ కాపలా కాస్తున్నారు. రాత్రిపూట మంచెల వద్ద తాటాకు మంటలు వేసుకుని, డప్పుల చప్పుడు చేస్తూ.. బిగ్గరగా కేకలు వేస్తూ పందుల గుంపులను బెదరగొడుతున్నారు. పందుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు చీరలు, మైకులతో ప్రయోగాలు చేస్తున్నారు. చేల చుట్టూ చీరలు కట్టడం ఫలితాన్నిస్తోందని రైతులు చెబుతున్నారు.